


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 16-10-2026 | సంపుటి - 31 | సంచిక - 144 | రూ : 4 | పేజీలు: 8



ముంగిట నీటి విపత్తు

- రాష్ట్రంలో 251 టీఎంసీల లోటు
- యాసంగిలో వరి వేయొద్దు
- విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి
- కేంద్రం పూర్తిస్థాయిలో సాయం అందించాలి
- దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం

నవంబరులో ప్రధాని వద్దకు రాష్ట్ర బృందం

కలిసికట్టుగా ఎదుర్కొందాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఎల్‌నినోతో ఏర్పడిన ప్రకృతి విపత్తును అందరం కలిసి సమైక్యంగా ఎదుర్కొందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జలాశయాల్లో 460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో.. 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. 251 టీఎంసీల **తరువాయి 2లో**

తెలంగాణ ఆడబిడ్డల
ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ



- **కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి**

హైదరాబాద్:తెలంగాణసంస్కృతి,సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండగ ప్రతీకని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సాగర్ సొసైటీ మైదానంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు..భారీ ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు.. మార్మోగిన పాటలతో ఆ ప్రాంతమంతా పండగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..''ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటే పండగ బతుకమ్మ. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు'' అని తెలిపారు. కార్యక్రమానికి హరియాణా మాజీ గవర్న **తరువాయి 2లో**

'సర్' రగడ: 17 రాష్ట్రాల్లో
సమ్మరీ రివిజన్ షెడ్యూల్ విడుదల



- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ **తరువాయి 2లో**

ఏషియన్ హీరోలకు మోదీ పిలుపు
'మనం చేసి చూపిద్దాం

- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల



చారిత్రక విజయాలపై ప్రశంసలు

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను **తరువాయి 2లో**


మున్సిపల్ ఎన్నికలు
కూటమి
సీట్ల లెక్క తేలింది!

- 2026 మున్సిపల్ ఎన్నికలకు కూటమి సీట్ల పంపకం ఖరారు
- మొత్తం 17 కార్పొరేషన్లలో 11 టీడీపీకి, 4 జనసేనకు, 2 బీజేపీకి కేటాయింపు
- 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోనూ టీడీపీకి సింహభాగం

2లో



యెమెన్ ప్యాలెస్‌పై క్షిపణి దాడి
ప్రధానికి తప్పిన ముప్పు



- ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది మృతి, పలువురికి గాయాలు
- దాడి నుంచి సురక్షితంగా బయటపడిన ప్రధాని, ఇతర మంత్రులు
- సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడి చేశామన్న హౌతీలు
- సౌదీ, హౌతీ రెబల్స్ మధ్య మరింత తీవ్రమవుతున్న ఘర్షణలు

యెమెన్‌లో మరోమారు ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడెన్ నగరంలోని అధ్యక్ష భవనంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడికి **తరువాయి 2లో**



సుప్రీంకోర్టు సీరియస్
రాహుల్ ప్రవర్తనపై
వివరణ కోరిన న్యాయస్థానం

- సుప్రీంకోర్టు వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌పై సుప్రీం అసహనం
- తన చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని స్పష్టీకరణ

సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర **తరువాయి 2లో**

భారత్-అమెరికా ట్రేడ్ డీల్
పీయూష్ గోయల్ కీలక ప్రకటన



- గత రెండు వారాల్లోనే 5వేలకు పైగా ఫేక్ సోషల్ మీడియా ఖాతాల సృష్టి
- 'సర్' నిరసనలను ఆసరాగా చేసుకుని హింసను ప్రేరేపించేందుకు కుట్ర
- కొత్త పంథాలో ఐఎస్ఐ.. చిన్న పట్టణాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి
- కొందరు భారతీయులకు డబ్బులిచ్చి దేశ వ్యతిరేక ప్రచారం

2లో

యెమెన్ ప్యాలెస్‌పై క్షిపణి దాడి: ప్రధానికి తప్పిన ముప్పు

యెమెన్‌లో మరోమారు ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నఏడెన్ నగరంలోని అధ్యక్ష భవనంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని అల్‌మాషిక్ ప్యాలెస్‌ను లక్ష్యంగా చేసుకుని హౌతీలు ఐదు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడి జరిగిన సమయంలో ప్యాలెస్‌లో ప్రధాని, ఇతర మంత్రులు ఉన్నప్పటికీ వారంతా సురక్షితంగా బయటపడ్డారని యెమెన్ సమాచార శాఖ మంత్రి మమ్మర్ అల్‌ఎర్యానీ వెల్లడించారు. అయితే, ఈ దాడిలో పలువురు గాయపడినట్లు ఆయన వివరించారు. మరోవైపు, ఈ దాడిపై హౌతీ అనుకూల మీడియా సంస్థలు స్పందించాయి. తాము సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక కార్యకలాపాల ప్రధాన కార్యాలయంతో పాటు ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించినట్లు ప్రకటించాయి. యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వైమానిక దాడులు నిర్వహిస్తున్న విషయం విదితమే. వీటికి ప్రతీకారంగా, ఇరాన్ మద్దతు గల హౌతీ రెబల్స్ తమ ఆధీనంలోని ప్రాంతాల నుంచి సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు జరిపిన క్షిపణి దాడిలో 13 మంది మరణించారు. గత దశాబ్ద కాలంలో సౌదీ అరేబియాలో జరిగిన అత్యంత భీకర దాడిగా దీనిని పరిగణిస్తున్నారు.

సుప్రీంకోర్టు సీరియస్
రాహుల్ ప్రవర్తనపై వివరణ కోరిన న్యాయస్థానం

సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా ఏర్పడిన గందరగోళాన్ని ప్రస్తావిస్తూ, రాహుల్ తన చర్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ముంగిట నీటి విపత్తు

హైదరాబాద్ : ఎల్‌నినోతో ఏర్పడిన ప్రకృతి విపత్తును అందరం కలిసి సమైక్యంగా ఎదుర్కొందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జలాశయాల్లో 460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో.. 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. 251 టీఎంసీల నీటి లోటుందని.. దేనినైనా కొనొచ్చు కానీ నీళ్లను కొనుక్కోలేమన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం గురువారం ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇది అత్యంత ఆందోళనకరమైన సందర్భమని.. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సీఎం సూచించారు. తాగునీటికే మొదటి ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. రైతులు పెద్ద మనసు చేసుకుని.. యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలని కోరారు. ముఖ్యంగా వరి వేయొద్దని.. వేస్తే నారుమడి దశలోనే ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశముందని చెప్పారు. ప్రజలు నీటిని వాహనాలు కడుక్కోవడానికి వాడొద్దని.. చుక్క.. చుక్క నీటినీ ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ కష్టకాలంలో కేంద్రం పూర్తి స్థాయిలో రాష్ట్రానికి సాయం అందించాలని...60:40 నిష్పత్తిలో నిధులు ఇవ్వాలన్నారు. దసరా తర్వాత అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని.. సీఎం నేతృత్వంలో నవంబరులో ప్రధానమంత్రి వద్దకు రాష్ట్ర బృందం వెళ్తుందని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ప్రతి జీవరాశికి వచ్చిన సమస్య ఇది

''ఈ రోజు రాష్ట్రంలోని ప్రజానీకానికి ముఖ్యమంత్రిగా నేను విజ్ఞప్తి చేస్తున్నా.. మనం ప్రకృతి విపత్తును ఎదుర్కోబోతున్నాం. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. మొదటి ప్రభావం చూపించేది రైతులపైనే. వర్షాలు లేకపోవడం వల్ల సాగు, తాగునీటి సమస్య రావడంతో పాటు.. విద్యుత్తు ఉత్పత్తి తగ్గిపోయింది. ఇదే సమయంలో కరెంటు వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో రోజు వారీ కార్యక్రమాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. భూమి మీద ఉన్న ప్రతి జీవరాశికి వచ్చిన సమస్య ఇది. వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశాం. తెలంగాణలో వరి పండించే రైతులు ఎక్కువగా ఉన్నారు. వరికి నీటి అవసరం చాలా ఎక్కువ. 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు. అయినా 56 లక్షల ఎకరాల్లో వరి వేశారు.

*** 20 వేల మెగావాట్లకు పెరిగిన విద్యుత్తు డిమాండ్**

అక్టోబరులో ఒక రోజులో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్తు డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. రాష్ట్రంలోని 30 లక్షల పంపుసెట్లు ఆన్ అయ్యాయి. మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబరులో ఉంది. రోజుకు 38 డిగ్రీలు నమోదవుతోంది. చలికాలం ఎండాకాలంలా ఉంది. ఈ రోజు 20,003 మెగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. విద్యుత్తు శాఖ సమర్థంగా పనిచేసి.. రైతులకు, ఇతర అవసరాలకు కరెంటు సరఫరా చేస్తోంది. మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో.. మార్కెట్‌లో ఏ ధరకు దొరికినా కొనుగోలు చేసి విద్యుత్తును రైతులకు అందిస్తున్నాం.

ఏషియన్ హీరోలకు మోదీ పిలుపు: 'మనం చేసి చూపిద్దాం'

భారత దేశం అనతి కాలంలోనే అంతర్జాతీయ క్రీడా రంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు 2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

చారిత్రక విజయాలపై ప్రశంసలు

ఈ సారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడారంగానికి ప్రభుత్వ అండ

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

'సర్' రగడ: 17 రాష్ట్రాల్లో
సమ్మరీ రివిజన్ షెడ్యూల్ విడుదల

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

వివాదానికి దారితీసిన సర్

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు

మున్సిపల్ ఎన్నికలు
కూటమి సీట్ల లెక్క తేలింది!

ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ జనసేనబీజేపీ కూటమి రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. 2026లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకం ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు గాను ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో స్పష్టతనిస్తూ కూటమి నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ పంపకాల్లో, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే తెలుగుదేశం పార్టీకి సింహభాగం దక్కింది.

కార్పొరేషన్ల కేటాయింపు ఇలా..

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల విషయానికి వస్తే, టీడీపీ 11 స్థానాల్లో పోటీ చేయనుంది. జనసేన పార్టీకి 4, బీజేపీకి 2 కార్పొరేషన్లను కేటాయించారు. గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి కీలక నగరాల భవిష్యత్తును ఈ పంపకం నిర్దేశించనుంది. విశాఖ, గుంటూరు, తిరుపతి, మచిలీపట్నం వంటి ప్రధాన కార్పొరేషన్లను టీడీపీ తన వద్ద ఉంచుకోగా, విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఏలూరు కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ఇక, రాజమహేంద్రవరం, అనంతపురం కార్పొరేషన్లను బీజేపీకి కేటాయించారు. మొత్తం మీద చూస్తే, 123 పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీ 89, జనసేన 25, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో, రెండేళ్ల ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ప్రణాళికతో సిద్ధమవడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును మరింత పటిష్టం చేసుకోవాలని కూటమి భావిస్తున్నట్లు ఈ సీట్ల పంపకం స్పష్టం చేస్తోంది.

భారత్..అమెరికా ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్ కీలక ప్రకటన

భారత్‌అమెరికా మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక పురోగతి లభించింది. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ట్రేడ్ డీల్‌లో మొదటి దశ ఖరారైందని, ప్రస్తుతం ఇది న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్టింగ్) దశలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. "అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి విడత చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రస్తుతం దీనికి తుది మెరుగులు దిద్దుతున్నాం. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత, మన పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా ఈ ఒప్పందాన్ని అమలు చేస్తాం" అని పీయూష్ గోయల్ వివరించారు. ఇదే విషయంపై వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, చర్చలు సానుకూల దిశలో సాగుతున్నాయని, వీలైనంత త్వరగా ఒప్పందం కొలిక్కి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో టారిఫ్ విధానంపై మరింత స్పష్టత వచ్చిన తర్వాత ఈ ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం ఈ ఒప్పందంపై ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు తుది దశకు (ల్యాండింగ్ పాయింట్) చేరుకుంటున్నాయని, ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు దక్కే అదనపు ప్రయోజనాలే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఇటీవల మాట్లాడుతూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, ఇది వెంటనే కార్యరూపం దాల్చే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఇంకా పరిష్కారం కాని కొన్ని అంశాలపై ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. టారిఫ్ సమస్యలు, ఇతర అడ్డంకులను తొలగించి, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో 2025 ప్రారంభం నుంచి భారత్, అమెరికా మధ్య ఈ చర్చలు సాగుతున్నాయి.

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండగ ప్రతీకని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సాగర్ సొసైటీ మైదానంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు..భారీ ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు.. మార్మోగిన పాటలతో ఆ ప్రాంతమంతా పండగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ''ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటే పండగ బతుకమ్మ. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు'' అని తెలిపారు. కార్యక్రమానికి హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ డీకే అరుణ, భాజపా మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు రూపకుమార్‌చౌదరి, మాజీ మేయర్ బండా కార్తికరెడ్డి, భాజపా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, నేతలు డా.గౌతమ్‌రావు, వేముల అశోక్, వీరేందర్‌గౌడ్, బద్దం మహిపాల్‌రెడ్డి, ఇంద్రా సేనారెడ్డి, బంగారు శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

*** సర్పంచ్ సీరం రాజమని**



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా భైంసా మండలం లోని ఇలేగాం సీరం రాజమణి సర్పంచ్ మాట్లాడుతు,వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంచేందుకు ఇళ్ల ప్రాంగణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,కళాశాలలు, ఇతర భవనాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని నీటి సంరక్షణ, మన బాధ్యత అని సీరం రాజమణి సర్పంచ్ సూచించారు.వర్షపు నీటిని కాలువల ద్వారా బయటకు పంపకుండా ఇంకుడు గుంతలకు మళ్లించడం ద్వారా బావులు,బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.ఇంకుడు గుంతలను సరైన ప్రదేశంలో, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించడంతో పాటు, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చు.ప్రజలకు ఉపయోగకరమైనది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భైంసా మండల ఎంపీవో ప్రదీప్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ పవార్ విజయ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ని నో నేపథ్యంలో రబీ లో ఆరుతడి పంటలు వేయండి

*** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా:ఎల్ ని నో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో ప్రస్తుతం రబీలో రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. గురువారం భైంసా లోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సేస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 50% సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అయన మాట్లాడారు.. ముందుగా చిన్న కారు రైతులకు సబ్సిడీ పై విత్తనాలు అందజేయాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరమందన్నారు. ఏప్రిల్ మే జూన్ లో నీటి ఎద్దడిని నివారించుకోవాలంటే గ్రామాల్లో సర్పంచ్ లు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.రైతుల కోరిక మేరకు సన్ ఫ్లవర్ విత్తనాలను సైతం సబ్సిడీపై అందించాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రితో, పాటు భైంసా వ్యవసాయ శాఖ ఏడిఏ తో పాటు, మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి, మండల సర్పంచ్ లు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో అరుదైన ఘనత సాధించిన చావా దేవిక

*** రెండు గంటల నిరంతర శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో తన ప్రతిభను చాటుకున్న13 ఏళ్ల చిన్నారి**





జగద్గిరిగుట్ట.(ప్రజాస్ఫూర్తి): తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చింతల్‌కు చెందిన 13 ఏళ్ల బాలిక చావా దేవిక స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించింది. 'కళాసంగమం-2026' కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఫ్యూచర్ టీచర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక నృత్య ప్రదర్శన లో పరమశివునికి అంకితంగా 'శివార్పణం' పేరిట నిర్వహించిన రెండు గంటల నిరంతర శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో చావా దేవిక తన ప్రతిభను చాటుకుంది.ఈ కార్యక్రమానికి ప్రముఖ నృత్య కళాకారిణి, సినీనటి మంజు భార్గవి ముఖ్య అతిథిగా హాజరై చావా దేవికకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందజేశారు.నృత్య గురువు డాక్టర్ రేవతి ప్రసాద్ మార్గదర్శకత్వంలో దేవిక ఈ ప్రదర్శనలో పాల్గొంది. భారతీయ శాస్త్రీయ నృత్యకళకు భక్తిభావాన్ని జోడిస్తూ పరమశివునికి నృత్యాన్ని అంకితం చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చింతల్ ప్రాంతానికి చెందిన దేవిక సాధించిన ఈ విజయంపై స్థానికులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవిక భవిష్యత్తులో నృత్యరంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పలువురు అభినందనలు తెలియజేశారు.

లీడ్ ఇండియా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి వేడుకలను లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మపల్లిలోని లీడ్ ఇండియా భవన్‌లో నిర్వహించారు. నవభారత నిర్మాణం, సమాజంలో మానవీయ విలువల వికాసం, యువతలో నాయకత్వ లక్షణాల పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పాఠశాలలు, విద్యాసంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులకు చేరువయ్యేలా 'ఆచార్య కలం హ్యూమన్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రోగ్రాం' నురూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, మోటివేటర్లు, యువ నాయకుల ద్వారా వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన విద్య, సామాజిక బాధ్యత వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుదర్శన ఆచార్యులు, లీడ్ ఇండియన్ ఫౌండేషన్ అడ్వైజర్ లక్ష్మీకాంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, శంషాబాద్ ట్రస్మా అధ్యక్షులు థామస్, లీడ్ ఇండియా కౌన్సిల్ అధ్యక్షురాలు శైలజ, లీడ్ ఇండియా ప్రొఫెషనల్ కౌన్సిల్ సభ్యులు డా. కొండల్ పులి, అనిత, సాయి , రాకేష్ ,సంధ్యారామ్, నరసింహ సాయి, శ్రీశైలం, శృతి రెడ్డి, సరళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లీడ్ ఇండియా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి వేడుకలను లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మపల్లిలోని లీడ్ ఇండియా భవన్‌లో నిర్వహించారు. నవభారత నిర్మాణం, సమాజంలో మానవీయ విలువల వికాసం, యువతలో నాయకత్వ లక్షణాల పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పాఠశాలలు, విద్యాసంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులకు చేరువయ్యేలా 'ఆచార్య కలం హ్యూమన్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రోగ్రాం' నురూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, మోటివేటర్లు, యువ నాయకుల ద్వారా వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన విద్య, సామాజిక బాధ్యత వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుదర్శన ఆచార్యులు, లీడ్ ఇండియన్ ఫౌండేషన్ అడ్వైజర్ లక్ష్మీకాంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, శంషాబాద్ ట్రస్మా అధ్యక్షులు థామస్, లీడ్ ఇండియా కౌన్సిల్ అధ్యక్షురాలు శైలజ, లీడ్ ఇండియా ప్రొఫెషనల్ కౌన్సిల్ సభ్యులు డా. కొండల్ పులి, అనిత, సాయి , రాకేష్ ,సంధ్యారామ్, నరసింహ సాయి, శ్రీశైలం, శృతి రెడ్డి, సరళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీక

*** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి పట్టణంలోని 19వ వార్డుతో పాటు కుందూరుపల్లి,రూరల్ మండలంలోని కమలాపూర్ గ్రామాల్లో గిరిజనులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీజ్ వంటి పండుగలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కుందూరుపల్లిలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు.అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా భైంసా మండలం లోని వానల్ ఫాడ్ గ్రామంలో దేవి నవరాత్రుల సందర్భంగా స్వయంభుగా వెలసిన సింహ సహిత దుర్గామాత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డి గారివిఠల్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే తో పాటు ఉపసర్పంచ్ సాయ రెడ్డి,మాజీ సర్పంచ్ రాంకుమార్, రాహుల్, గంగాధర్ పటిల్, భూచన్న, ఆశన్న, నారాయణ, భోజరం, హరీష్ పటిల్, సాయిరెడ్డి,రాము, చిన్ను, అనిల్, రాజు ,ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు ,గ్రామస్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బాసుపల్లి రాంరెడ్డి



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు-కిష్టాపూర్ 298 వ డివిజన్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు బాసుపల్లి రాంరెడ్డి గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో రాంరెడ్డి తన అనుచరులతో కలిసి పార్టీలో చేరగా, మల్లారెడ్డి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాబోయే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పూడూరు-కిష్టాపూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని మల్లారెడ్డి సూచించారు. దీనికి స్పందించిన రాంరెడ్డి మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాంరెడ్డి తన అనుచరులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రాంరెడ్డి అనుచరులు పాల్గొన్నారు.

యువ కవి రాజేష్‌కు దాశరథి - సినారె' గజల్ పురస్కారం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం పట్టణానికి చెందిన యువ కవి రాజేష్‌కు దాశరథి-సినారె తెలుగు గజల్ పురస్కారం లభించింది. గుంటూరులో బుధవారం జరిగిన మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ 40 వసంతాల గజల్ గాన వేడుకలు, 60 వసంతాల తెలుగు గజల్‌కు నీరాజన ఉత్సవాల సందర్భంగా రాజేష్‌కు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ బి.కృష్ణ మోహన్, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షకులు, శాసనసభ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ పార్లమెంట్ సభ్యులు లగడపాటి రాజగోపాల్, ఆంధ్ర ప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు విక్రమ్ పూల, తెలుగు సంస్కృత సంస్థ అధ్యక్షులు విల్సన్ శరత్ చంద్ర, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గజల్ కవులు రెంటాల వేంకటేశ్వర రావు, రసరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ దాశరథి సినారె గజల్ పురస్కారం తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, తనకు గజల్ ఓనమాలు దిద్దించిన గురువు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు ధ్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు, ప్రముఖులు రాజేష్‌ను అభినందించారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి):జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నమోదవుతున్న కేసుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న సేవలు, కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కోర్టు పరిపాలనాధికారి పారిజాతం, ఎస్ఐ స్వప్నకుమారి, కోఆర్డినేటర్ రమాదేవి, లీగల్ కౌన్సిలర్ రజిత, సూపరింటెండెంట్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

దేవలమ్మ నాగారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ:

- సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామంలో సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. రేషన్ కార్డు దారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్మార్ట్ స్టేషన్ కార్డులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పిఏసిఎస్ డైరెక్టర్ సుగుణమ్మ, వార్డు సభ్యులు ఊదరి రమేష్, దోనూరు కిరణ్ రెడ్డి, బొమ్మ శ్వేత, పాక రాము, జిపిఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నుండి

భూ సర్వే వరకు ఫీల్డ్ లోనే పరిశీలించిన కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్,గురువారం గూడూరు మండలంలోని బొద్దుగొండ, మదనాపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.మదనాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.రైతులు తమ భూముల హద్దులను ముందుగా స్థిరపరుచుకోవాలని, ముందస్తు సమాచారం అందించి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పంట మార్పిడి విధానం వైపు మొగ్గు చూపాలని, నీటి వాడకం తక్కువగా ఉండే పంటలు వేయాలని రైతులకు సూచించారు.వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద రైతులకు పనులు అప్పగించాలని, సాగునీరు,తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని, పీఏసీఎస్ ద్వారా అర్హులైన రైతులకు పంట రుణాలు అందించాలని తెలిపారు.ఈ పర్యటనలో ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ చీర శ్రీనివాసులు, తహసీల్దార్ నాగ భవాని,రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్‌రెడ్డి,సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇరవై లక్షల విలువైన పేలుడు పదార్థాలు స్వాధీనం

* **యుపి నుండి తెలంగాణకు అక్రమంగా పేలుడు పదార్థాల రవాణా**
* **ఏడుగురు అరెస్టు, మరో ఇద్దరిపై కేసు నమోదు**



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... గురువారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కేసు వివరాలను వెల్లడించారు. జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు వాహనాల్లో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, బూస్టర్లు బయటపడ్డాయి.ఉత్తరప్రదేశ్ నుంచి అక్రమ రవాణా విచారణలో నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ద్వారా పేలుడు పదార్థాలను సమకూర్చుకుంటున్నట్లు వెల్లడైంది. అక్కడికంపెనీనుంచి ఇతరుల పేర్లపై బిల్లులు తీసుకొని, బూస్టర్ బాక్సుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నింపి తెలంగాణకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం వాటిని క్రషర్లు, క్వారీలు, మైన్స్‌కు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.ఈ క్రమంలో నిందితులు రెండు వాహనాల్లో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి పేలుడు పదార్థాలను తీసుకువస్తుండగా, జైనథ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు.ఈ ఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, ఏడుగురు నిందితులను అరెస్ట్‌చేశారు.మరో ఇద్దరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు, ఈ అక్రమ రవాణాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి,జైనథ్ సీఐ జి.శ్రావణ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైపి.గౌతమ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా సుంకు నవీన్ ముదిరాజ్



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ గురువారం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మేడ్చల్ రూరల్ జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

వంటా వార్పుతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు.దీర్ఘకాలంగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ నాయకులు కోరారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా, శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, కార్యదర్శి మధుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘురాం, కోశాధికారి శ్రీను, కోఆర్డినేటర్ ప్రవీణ్, డాక్టర్ జగదీశ్, సలహాదారులు ప్రభాకర్, శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి రాజు, ఏఎన్ఎంలు పార్వతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పోస్టులకు ప్రశాంతంగా రాత పరీక్ష

* **14 పోస్టులకు 98 మంది అభ్యర్థులు హాజరు**



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో మిషన్ వాత్సల్య కింద చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లో 8 పోస్టులు, మిషన్ శక్తి మహిళా సా ధికారత జిల్లా కేంద్రంలో 6 పోస్టుల భర్తీ కి గురువారం కలెక్టరేట్‌లో రాత పరీక్ష ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వ హించారు. మొత్తం 14 పోస్టులకు 112 దరఖాస్తులు రాగా, 98 మంది అభ్యర్థు లు పరీక్షకు హాజరయ్యారు. మరో 14 మంది గైర్హాజరయ్యారు. చైల్డ్ హెల్ప్‌లైన్ లో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, కౌన్సిలర్, సూ పర్‌వైజర్, కేస్ వర్కర్ పోస్టులకు, మహి ళా సాధికారత కేంద్రంలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్, జెండర్ స్పెషలిస్ట్, ఫైనా న్షియల్ లిటరసీ స్పెషలిస్ట్, అకౌంట్స్ అ సిస్టెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల కు పరీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జిల్లా ఉపాధి అధికారి కు మారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం

* **తులం బంగారం ఇవ్వకుంటే లక్ష 50 వేల రూపాయలు ఇవ్వండి**
* **చెక్కుల పంపిణి కార్యక్రమం లో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్**

ప్రజాస్ఫూర్తి,భైంసా:కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని బృందావన్ గార్డెన్స్ లో 121 మందికి భైంసా పట్టణం, మండలం లోని ఆయా గ్రామాల వారికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 69 మందికి కళ్యాణ లక్ష్మి, 52 మందికి షాదీ ముబారక్ చెక్కులను అందించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటినుండి ఇప్పటివరకు ఆరు దఫాలుగా చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, లబ్ధిదారులకు ఆలస్యం చేయకుండా త్వరిత గతిన అందిస్తున్నామన్నారు. తులం బంగారం ఇవ్వలేకపోతున్నామని కేంద్ర ప్రభుత్వం వల్లే బంగారం ధరలు పెరిగాయని కాంగ్రెస్ నాయకుల మాటలు మాట్లాడడం అది అజ్ఞానమే అవుతుందన్నారు. డాలర్ విలువ ప్రకారం బంగారం ధర పెరుగుతుందన్నారు. భైంసా పట్టణం మండలంలో మరో 244 మంది దరఖాస్తులు చేసుకున్నారని, 144 మందికి త్వరలోనే చెక్కులు ఇవ్వనునట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, భైంసా పట్టణ నాయకులు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు , పెద్ద మొత్తంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతికి ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలి

* **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యాపరంగా ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై నిర్వహించిన సుదీర్ఘసమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల క్రమం తప్పని హాజరుతోనే ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత గడువులోగా సిలబస్‌ను పూర్తి చేసి, ప్రతి సబ్జెక్టును విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధించాలని అన్నారు. ప్రతిరోజూ నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షించాలని తెలిపారు.పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

* **విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్ రూపకల్పనపై ప్రధానోపాధ్యాయుడికి అభినందన**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్‌ను రూపొందించిన ప్రధానోపాధ్యాయుడు మునిందర్ రాజును జిల్లా కలెక్టర్ అభినందించారు.గణితం తదితర సబ్జెక్టులను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా పాఠాలు, మెళకువలు, అభ్యాస విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవతో వెబ్ సైట్ ను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను మరింత మంది ఉపాధ్యాయులు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత




* **రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్**

కూకట్‌పల్లి ,ప్రజాస్ఫూర్తి : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లివై జంక్షన్ జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ గండు వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కె.శేఖర్ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా ఇంచార్జ్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సతీష్ గౌడ్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పాటించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ, ప్లకార్డు లతో ప్రదర్శన నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించాలని, అతివేగం ,నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా పదాధికారులు, నియోజకవర్గానికి సంబంధించిన బిజెపి సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

* **మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట గ్రామంలో వెలిసినటువంటి కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రులలో భాగంగా అమ్మవారు ఐదవ రోజు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి దర్శించుకొని చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు అమ్మవారి శేష వస్త్రంతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసి నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. అనంతరం కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఆలయ ప్రధానార్చకులు మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా 5వ రోజు కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారని అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, భోగభాగ్యములు, ఉద్యోగ, వ్యాపారంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. నవరాత్రులలో ప్రతిరోజు ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గ్రామ ప్రజలు భక్తులు దుర్గామాత మాలధారణ వారు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



భువనగిరి,ప్రజాస్ఫూర్తి:దసరా పండుగ పురస్కరించుకుని భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు ఆ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బర్రె పూజిత జహంగీర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం రేయింబవళ్లు కష్టపడే పారిశుద్ధ్య,నీటీ సరఫరా, కార్మికుల సేవలు అభినందనీయమని, దసరా పండుగ వేళ వారిని గౌరవించుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. పండుగ రోజుల్లో కూడా సెలవు లేకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాయిని అరుణ పూర్ణచందర్, వార్డు ఇంచార్జ్ వినోద్, ఇంచార్జ్ జవాన్ బి శ్రీధర్, నీటి సరఫరా లైన్మెన్ టి.కృష్ణ,మున్సిపల్ కార్మికులు, బండారు రవివర్ధన్, పోకల నాగరాజు, గోపే బాబు, గాయపాక వెంకటేష్, గోపే రాజు, బర్రె క్రాంతి కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా వేడుకలను సోదర భావంతో నిర్వహించు కోవాలి

* **ఎస్సై ఎం. భరత్**



రఘునాథపల్లి ,ప్రజాస్ఫూర్తి:దసరా సెలవుల నేపథ్యం లో ప్రజలు. తల్లిదండ్రులు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రఘునాథపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎం భరత్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ దసరా పండుగను ప్రశాంతంగా సోదర భావంతో జరుపుకోవాలని కోరారు. పండుగ వేళ గ్రామాలలో గొడవలు, ఘర్షణలకు తావివ్వకూడదని. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ .కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ను ధరించాలి అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సామాజిక మధ్య మాల్లో తప్పుడు వార్తలు రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేయవద్దు అన్నారు. సెలవుల్లో పిల్లలు చెరువులు బావులు, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు రోడ్లపై ఆటోలలో రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.. బతుకమ్మలను నీటి ప్రదేశాల్లో నిమర్జెన్సీ చేసేటప్పుడు చిన్న పిల్లలను నీటి దగ్గరికి తీసుకపోకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు అత్యవసర పరిస్థితుల్లో 100 కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజల భద్రతను పోలీసుల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు రాధే శ్యామ్, ఓబీసీ మోర్చా కోకన్వీనర్ కాంచి శివలకు అభినందనలు



కుకట్ పల్లి,ప్రజాస్ఫూర్తి : బీజేపీ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులుగా రాధే శ్యామ్, కూకట్‌పల్లి అసెంబ్లీ ఓబీసీ మోర్చా కోకన్వీనర్‌గా కాంచి శివ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి బీజేపీ అగ్రనేతలు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ సమక్షంలో రాధే శ్యామ్, కాంచి శివలకు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు వారు మరింత అంకితభావంతో కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు

సింగరేణి కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

*** ఆదాయపు పన్ను భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది**

*** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



(భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి): సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో కార్మికుల ఆదాయపు పన్ను భారాన్ని ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గురువారం భూపాలపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడిపై నెలకు సుమారు రూ.10 వేల వరకు పడుతున్న ఆదాయపు పన్ను భారాన్ని తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2025-26లో బొగ్గు ఉత్పత్తి తగ్గినప్పటికీ కార్మికులకు రూ.1,754 కోట్ల బోనస్ అందించామని, ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1.53 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణపై కార్మికుల్లో ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు.

*** వారసత్వ ఉద్యోగాల్లో పారదర్శకత***

కార్మికుల పిల్లలకు వారసత్వ ఉద్యోగాల కల్పనలో దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ఫిట్ కేసుల్లో అర్హులకు న్యాయం జరిగేలా ఏరియా ఆసుపత్రుల్లో నెలవారీ మెడికల్ బోర్డుల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. కార్మికుల పేర్ల మార్పిడి సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేశామని, పదవీ విరమణ చేసిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇళ్లు లేని కార్మికులకు 250 గజాల స్థలం కేటాయించే ప్రతిపాదన ఉందన్నారు.

*** *కొత్త గనులతో ఉపాధి అవకాశాలు***

తాడిచెర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ఓపెన్‌కాస్ట్ గనులకు సంబంధించి చర్యలు చేపడుతున్నామని, వెంకటాపూర్ ప్రాంతంలోనూ కొత్త గని ఏర్పాటుకు ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. సింగరేణి అభివృద్ధితో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

*** *భూపాలపల్లి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు***

గతంలో సుమారు 600 మంది ఓటర్లతో ఉన్న చిన్న గ్రామంగా ఉన్న భూపాలపల్లి నేడు లక్ష జనాభాతో అభివృద్ధి చెందిన పట్టణంగా ఎదిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. పెరిగిన జనాభా, పట్టణ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు రహదారుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. భూపాలపల్లిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థుల కోసం రూ.130 కోట్లతో వసతులు కల్పించామని, సుమారు 400 మంది విద్యార్థులు ఉండే హాస్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన కల్పించేందుకు 50 ఎకరాల్లో పరిశోధనలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి సింగరేణి గ్రౌండ్ వరకు సుమారు రూ.73 కోట్లతో రహదారుల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో చిన్న దుకాణాలు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ మధు, ఐఎన్‌టీయూసీ నాయకుడు రఘుపతిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పల రాజేందర్, ఇస్లావత్ దేవన్, సాంబమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 16న బతుకమ్మ సంబరాలు.. మహిళలకు ప్రత్యేక బహుమతులు!

గోలేటి/కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా (ప్రజా స్ఫూర్తి):బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి గోలేటి సింగరేణి హైస్కూల్ మైదానంతో పాటు మాదారం రామాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిజిఎం (పర్సనల్) దేవరకొండ కిరణ్ బాబు తెలిపారు. ఆకర్షణీయంగా పేర్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని, అలాగే నిర్ణీత పరిమాణంలో బతుకమ్మలతో వచ్చి ఆటపాటల్లో పాల్గొనే ప్రతి మహిళకూ న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు ప్రత్యేక బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు హాజరయ్యే మహిళల సౌకర్యార్థం గోలేటి గ్రామానికి ప్రత్యేక బస్సు వసతిని కూడా కల్పిస్తున్నామని, కావున మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ (ఫ్యామిలీ డే) బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

హుస్నాబాద్ పురపాలక సంఘం ముందస్తు బతుకమ్మ సంబరాలు



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి:హుస్నాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల పాల్గొన్నారు.రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగ అతిపెద్ద పండుగల్లో ఒకటనిఅన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్ పర్సన్ దండి లక్ష్మి వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ కౌన్సిలర్లు మెప్మా ప్రతినిధులు ఐసిడిఎస్ సిబ్బంది వివోలు మహిళా సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రజాస్ఫూర్తి,ఖైరతాబాద్: జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బతుకమ్మలకు పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో పూల బతుకమ్మలను పేర్చి, ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వీరితో పాటుగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా లయబద్దంగా బతుకమ్మ ఆడారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అంటే ప్రకృతి, వ్యవసాయం, రైతులతో మమేకం అయ్యి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు అన్ని సమస్యల నుంచి బయటపడాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు రైతులకోసం ప్రార్థించాలని కోరారు.జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ బతుకమ్మ వేడుకల్లో ఇన్ చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఖజానా శాఖ అధికారి సరోజ, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు వేగవంతమైన చర్యలు

- 2,009.23 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు.

- 2,004.31 ఎకరాలకు నోటిఫైడ్ పీఎన్ జారీ



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ (జాయింట్ యూజర్) విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయం కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,004.31 ఎకరాలకు సంబంధించి నోటిఫైడ్ పీఎన్ జారీ చేసినట్లు వెల్లడించారు.గ్రామాల వారీగా భూసేకరణ వివరాలు ఇలా ఉన్నాయి. అర్లిబి గ్రామంలో 160.32 ఎకరాలు, కచ్‌కంటి గ్రామంలో 29.19 ఎకరాలు, టాక్లి గ్రామంలో 5.20 ఎకరాలు, అనుకుంట గ్రామంలో 878.13 ఎకరాలకు పూర్తిస్థాయిలో నోటిఫైడ్ పీఎన్ జారీ చేశారు. నిషాన్‌ఘాట్ గ్రామంలో ప్రతిపాదిత 430.09 ఎకరాలకు గాను 428.16 ఎకరాలకు, ఖానాపూర్‌లో 288.14 ఎకరాలకు గాను 288.13 ఎకరాలకు నోటిఫైడ్ పీఎన్ జారీ చేశారు. ఆదిలాబాద్ గ్రామంలో 216.36 ఎకరాలకు గాను 213.38 ఎకరాలకు సంబంధించి ప్రక్రియ పూర్తయింది.మొత్తం ప్రతిపాదిత భూమిలో దాదాపు పూర్తి విస్తీర్ణానికి సంబంధించి నోటిఫైడ్ పీఎన్ జారీ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన భూమికి సంబంధించిన ప్రక్రియను సైతం నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు మరింత అవకాశం కలుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకలను నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.బతుకమ్మ వేడుకలలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 18 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13నమహిళా శిశు సంక్షేమ శాఖ , మార్కెటింగ్, పరిశ్రమల శాఖ, మెప్మా శాఖలు బతుకమ్మ వేడుకలు నిర్వహించాయని, 14 న మునిసిపల్, ట్రాన్స్‌కో, మత్స్య శాఖ, బి సి, ఎస్ సి, ఎస్ టి, మైనారిటీ సంక్షేమ శాఖలు,సహకార, పౌర సరఫరాల శాఖ, టి యన్ జీ ఓ , సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు . 15 న వ్యవసాయ , సెరికల్చర్, ఉద్యాన, చేనేత ,జౌళి , పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని, 16న వైద్య ఆరోగ్య జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి, యువజన సంక్షేమ శాఖ, మెప్మా, కార్మిక శాఖ, బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో, బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.17న డి ఆర్ డి ఏ, జిల్లా పంచాయతీ ,ప్రణాళిక శాఖ , ఆర్టీసీ,మెప్మా, దేవాదాయ శాఖ,రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అలాగే చివరి రోజైన 18 న సద్దుల బతుకమ్మను అటవీ శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఫైర్, రవాణా మెప్మా, విద్యా శాఖ మరియు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలలో సంబంధిత శాఖల అధికారులు , సిబ్బంది తప్పనిసరిగా హాజరై ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా ఎన్జీ కళాశాల ఆవరణలోఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలను నల్గొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, నల్గొండ తహసీల్దార్‌లకు అప్పగించామని, వేదిక అలంకరణ, లైటింగ్, మైక్ సిస్టమ్, పారిశుధ్యం మరియు తాగునీటి సదుపాయాలను మునిసిపల్ కమిషనర్ పర్యవేక్షిస్తున్నారని ,ప్రతిరోజూ 3 నుండి 4 స్వయం సహాయక సంఘాల మహిళలను బతుకమ్మ పండుగలో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు.



పి ఆర్ సి పై తాత్సారం చేస్తే మరొక ఉద్యమం చెయ్యక తప్పదు

*** ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ: పి ఆర్ సి పై ప్రభుత్వం ఇంకా తాత్సారం చేస్తే ఉద్యమం చేయక తప్పదని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి హెచ్చరించారు.గురువారం స్థానిక జీఎం గార్డెన్ నల్లగొండ నందు 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర సంఘ అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైనది. ముఖ్యఅతిథిగా పి ఆర్ టి యు ఎమ్మెల్సీ పింగిల్ శ్రీపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతు పి ఆర్ సి సాధన, పెండింగ్ బిల్లుల పరిష్కారం, ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీ సిపిఎస్ విధానం రద్దు, యిహెచ్ఎస్ విధానంలోని లోపాలను సరిచేయడం, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం తదితర సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో తన గొంతుకను వందల సార్లు వినిపిస్తున్నానని, పలు మార్లు యి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తున్నానని ఐనా సరే ఈ మొండి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తకుండా కనీసం స్పందించడం లేదు అని ఆగ్రహం వెలిబుచ్చారు.సెప్టెంబర్ 1న 35,000 మంది ఉపాధ్యాయులతో ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నాను నిర్వహించారు. ఇక ముందు కూడా సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు.చట్ట సబలలలో ఈ సారి ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యల సాధన కోసం నాతో పాటుగా మరొక ఉద్యమ గొంతుక ఉండాలన్న ఆలోచనతో రాబోయే వరంగల్ ఖమ్మం నల్లగొండ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా లో సుమారు 15 యేండ్లు అధ్యక్షుడు గా పని చేసి ప్రస్తుతం రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి గా ఉన్న సుంకరి బిక్షం గౌడ్ పి ఆర్ టి యు అధికారిక అభ్యర్థిగా ఈ సమావేశం లో ప్రకటించారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో 72,000 సభ్యత్వం కలిగిన ఏకైక ఉపాధ్యాయ సంఘం పిఆర్టియు సంఘమని సంఘం స్థాపించినప్పటి నుంచి అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందని ఇక ముందు కూడా సమస్యల పరిష్కారం దిశగా పిఆర్టియు సంఘం పనిచేస్తుందని తెలియజేశారు. రాష్ట్ర సంఘ ప్రధాన ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ మాట్లాడుతూ, వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్టియు అభ్యర్థిగా నన్ను ప్రకటించి నందుకు శ్రీపాల్ రెడ్డికి, రాష్ట్ర సంఘానికి కృతజ్ఞతలు తెలియ చేశారు. తప్పనిసరిగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థుల, నిరుద్యోగుల మరియు విద్యావంతుల సమస్యల గొంతుకగా మారి గత ప్రభుత్వం చేసిన తప్పులే ఈ ప్రభుత్వం చేస్తున్నందున. వారికి తగిన గుణపాటం చెప్పుతామణి వారు చెప్పారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పిఆర్టియు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకట్రెడ్డి, గుండు లక్ష్మణ్, జగన్మోహన్ గుప్త,నల్గొండజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాళం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి, గీత, త్రివేణి, విజయలక్ష్మి, కళావతి, శ్రీవిద్య, అనిత రెడ్డి, సునీత , 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు .ప్రాథమిక సభ్యులు వేలాదిగా పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకల్లో మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో అలరించారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించడంతో సందడి నెలకొంది. ఇలాంటి వేడుకలు సిబ్బందిలో ఐక్యత, సంతోషాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.జీజీహెచ్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొని బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నర్సింగ్ ఆఫీసర్లు పద్మ, సఫియా, ఎసుకరునా, కుసుమ కుమారి, ఎస్తేర్ రాణితో పాటు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి ఏరియాలో సింగరేణి క్రీడా పోటీలు ప్రారంభం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో రెండు రోజులపాటు నిర్వహించే కంపెనీ స్థాయి లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్లు గురువారం ప్రారంభమయ్యాయి. ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.తొలుత కృష్ణకాలనీ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఒలింపిక్ జెండాను ఆవిష్కరించి, సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన సీనియర్ క్రీడాకారులను సన్మానించారు. క్రీడాకారులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రామన్ వి. పాఠక్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్‌సుందర్, సీనియర్ పీవో సాయికృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు మోటపలుకుల రమేశ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. మధుకర్‌రెడ్డి, భూపాలపల్లి సీఎంఓఏఐ అధ్యక్షుడు నజీర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, క్రీడా రిఫరీలు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: దేవి శరన్నవరాత్రిఉత్సవాలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి దేవమ్మ బస్తీలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, బీజేపీ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు జే.కె.శేఖర్యాదవ్,బీఆర్ఎస్ యూత్నాయకులు కొలుకుల జైహింద్,యువ నాయకులు ఆర్థిక యాదవ్‌లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో జగద్గిరిగుట్ట ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనం మధ్య జన నేత గాంధీ జన్మదిన వేడుకలు

*** సర్వమత ప్రార్థనలు.. ఆశీర్వచనాలు.. కేక్ కట్ చేసి సంబరాలు**





(శేరిలింగంపల్లి,ప్రజాస్ఫూర్తి) : పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు జనసందోహం మధ్య ఘనంగా జరిగాయి. బుధవారం కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని నివాసంలో ఆయన అభిమానులు హోట్టహాస్యంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆయన నివాసం సందడిగా మారింది .ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక సర్వమత ప్రార్థనలు నిర్వహించి గాంధీకి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మత పెద్దల సమక్షంలో కేక్ కట్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు గాంధీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, పార్టీ శ్రేణులు, యువకులు, మహిళలు, వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు గాంధీతో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానుల రాకతో ఆయన నివాస ప్రాంగణం కిటకిటలాడింది.గాంధీని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ

సూక్ష్మ ఆకృతులతో హిస్టో రంగోలి



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):అంతర్జాతీయ అనాటమీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ, పాథాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో హిస్టో రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సూక్ష్మదర్శినిలో కనిపించే కణజాలాల ఆకృతులను వైద్య విద్యార్థులు రంగులతో అందంగా తీర్చిదిద్ది తమ సృజనాత్మకతను చాటుకున్నారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల, ఆసుపత్రి ప్రొఫెసర్లు అభినందించి బహుమతులు అందజేశారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ రావు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ పవన్ కుమార్, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ సురేందర్, పాథాలజీ విభాగం నుంచి డాక్టర్ పావని, అనాటమీ విభాగం నుంచి డాక్టర్ అజయ్ ప్రకాష్, డాక్టర్ లూయిస్ ఫీబీ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి: పెద్దేముల్‌లో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారసింగ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామస్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది

నాణ్యమైన ఆహార పదార్థాలు సరసమైన ధరలకు అందించాలి

*** మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి**



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ :నాణ్యమైన ఆహార పదార్థాలు సరసమైన ధరలకు అందించి ప్రజల మన్ననలు పొందాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి మాజీ జడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి కోరారు.గురువారం ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రుచి హోటలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటల్ యజమాని చనిపోయిన వెంకన్న లక్ష్మీ దంపతులు గత 20 సంవత్సరాలుగా రోడ్డు మీద బండి పెట్టి టిఫిన్ సెంటర్ నడిపిస్తూ పట్టణ ప్రజలకు రుచికరమైన ఆహార పదార్థాలను వినియోగదారులు అందించి మన్ననలు పొందాలని కొనియాడారు. వినియోగదారుల ఇచ్చిన స్ఫూర్తిప్రేరణ ప్రోత్సాహంతోనే నేడు రుచి హోటల్లో ప్రారంభించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, రాములబంద సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్, కార్పొరేటర్ సమీ. హమ్మద్, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ఉదయ్ గౌడ్ చిన్నబోయిన నాగేష్ రాజు తదితరులు పాల్గొన్నారు .

అపూర్వ సమ్మేళనం.. 40 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండలంలోని గడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం 40 సంవత్సరాల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు ఆనాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ చిన్ననాటి మిత్రులను కలుసుకుని అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తాము విద్యాభ్యాసం చేసిన గడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10 వేల విలువైన పోడియంను పూర్వ విద్యార్థులు బహుమతిగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రామినేని సత్యం, వెంకయ్య, జానీ మియా, వీరారెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తికి నిదర్శనం.. నాలుగు నెలల్లో రూ.40 లక్షల టర్నోవర్



జనగామ, ప్రజాస్ఫూర్తి : మహిళలు పట్టుదలతో కృషి చేస్తే స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవవచ్చని జిల్లాకు చెందిన రాధిక, ప్రియాంక నిరూపిస్తున్నారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల నిర్వహణ ద్వారా కేవలం నాలుగు నెలల్లోనే ఇద్దరూ కలిపి రూ.60 లక్షల టర్నోవర్ సాధించి ఆదర్శంగా నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాధిక గతంలో ఉద్యోగాల కోసం ప్రయత్నించి, కుటుంబ పరిస్థితుల కారణంగా ఉద్యోగాన్ని వదులుకోవడంతో పాటు, డీఎస్సీలో కేవలం 0.5 మార్కు తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయారు. అయినప్పటికీ నిరాశకు లోనుకాకుండా స్వయం ఉపాధిని ఎంచుకుని, రైతు సేవా కేంద్రం ద్వారా రూ.40 లక్షల టర్నోవర్ సాధించారు. అదేవిధంగా, కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన ప్రియాంక రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తూ నాలుగు నెలల్లో రూ.20 లక్షల టర్నోవర్ సాధించారు. ఈ కేంద్రాలు తమ కుటుంబ పోషణకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని వారు తెలిపారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి ద్వారా వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలు దోహదపడుతున్నాయని, రాధిక, ప్రియాంక విజయగాథలు ఇతర మహిళలకు స్ఫూర్తిగానిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని 48వ వార్డులో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్నఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మాశెట్టి నివేదిత .ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణారెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలి

*** జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :రిమ్స్ ఆసుపత్రిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణాలు, మరమ్మతులు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం రిమ్స్ ఆసుపత్రితో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, కొత్తబ్లాక్ నిర్మాణాలను, మరమ్మత్తు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో రిమ్స్ డైరెక్టర్ చాంబర్లో అధికారులతో సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెండర్లలో బిడ్లు తక్కువకు వేసినప్పటికీ పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. ఎంబీఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం కన్సల్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించి, నిర్దేశిత 13 14 శాతం ప్రాఫిట్ మినహాయించి నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. కొత్తబ్లాక్, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటెండెండ్లు,రోగులసౌకర్యార్థంవాషింగ్ ఏరియాలు, డస్ట్ బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. డస్ట్ బిన్లు, వాషింగ్ బేసిన్లు సక్రమంగా వాడకపోతే లేదా పరిశుభ్రత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలకు, సెక్యూరిటీ గార్డులకు తక్షణమే జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన బుక్స్ ప్రింట్ అయ్యాయని, త్వరలో క్షేత్రస్థాయిలో జరిమానాల అమలు ప్రారంభమవుతుందని తెలిపారు. పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు.అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భూ కొలతల సర్వే శాఖలో సర్వేయర్‌గా పని చేస్తున్న గోవింద్ ను కలెక్టర్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ తనిఖీలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వివిధ విభాగాల వైద్యులు, రోడ్లు భవనల శాఖ ఈఈ రమేష్, పంచాయతీ రాజ్, మున్సిపల్, జి.ఎం.ఎస్.సి.డి ల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి



*** జిల్లా కలెక్టర్ కె. హరిత**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి: ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కె. హరిత ఆధ్వర్యంలో హెచ్ఐవీ అవగాహన బైక్ ర్యాలీ , కిసాన్ మేళా కార్యక్రమాలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. జిల్లాలో ప్రస్తుతం 736 మంది హెచ్ఐవీ బాధితులకు రింగ్స్ ఆసుపత్రి ద్వారా వైద్యం అందిస్తూ జిల్లాను సురక్షిత స్థితిలో ఉంచామని కలెక్టర్ తెలిపారు. ప్రజా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీని ప్రారంభించిన అనంతరం, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబులతో కలిసి ప్రేమల గార్డెన్స్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలో కలెక్టర్ మాట్లాడారు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని 25 శాతం తగ్గించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే ప్రత్యామ్నాయ, వర్షాభావం వల్ల నీటి నిల్వలు తగ్గుతున్నందున రైతులు నేల పరీక్షలు చేయించుకుని, నీటిని పొదుపుగా వాడుతూ ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం సాధించాలని ప్రజాప్రతినిధులు ,అధికారులు పిలుపునిచ్చారు.

ఎల్లంపేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు వేడుకల్లో పాల్గొని, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. పండుగ వాతావరణంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది.మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ ఈ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టగా, మున్సిపల్ సిబ్బంది కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ పంచాయతీలో పాల్గొనండి

*** ఈ నెల 17న ములుగు కలెక్టరేట్‌లో కార్యక్రమం**



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ములుగు జిల్లా కలెక్టరేట్‌లో ఇన్నోవేషన్ పంచాయతీ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆవిష్కర్తలు, విద్యార్థులు, నూతన ఆలోచనలు కలిగిన యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలు ఉన్నవారు, ఇప్పటికే కొత్త వస్తువులు లేదా పరికరాలను రూపొందించినవారు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.నిపుణుల మార్గదర్శకత్వంతో ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు, ఆవిష్కరణలను మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అధిక సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఘనంగా చండీ హోమం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం వేద పండితులు దుద్దిళ్ల శ్రీనుబాబుకు ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ..



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: తెలంగాణప్రాంత మహిళలు ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని అంగన్వాడి ఉపాధ్యాయురాలు సరస్వతి నీరజ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గిరినగర్ డివిజన్ పరిధి,గిరినగర్ లోని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ మంటపం వద్ద స్థానిక బతుకమ్మ మహిళా గ్రూప్ సభ్యులు వేడుకలు వద్ద ఘనంగా జరుపుకుంటున్నారు. తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో ఇష్టంగా ఆటపాటలతో సంబరాలు చేసుకుంటున్నారని విశిష్టతగల పండుగ అన్నారు.బతుకమ్మగ్రూపు మహిళలు ఏ.ధనలక్ష్మి,శోభ,రాధిక,ఎస్.అరుణ, కే.వాణి,కే.లావణ్య,ఎన్. పద్మ,జె.పద్మ,జె.ప్రియాంక, శ్వేత,రమాదేవి, స్వాతి,సరస్వతి,లక్ష్మి, యువతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి రేవంత్ సర్కార్ పెద్దపీట

*** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



వలిగొండ,ప్రజాస్ఫూర్తి: వలిగొండ మండల కేంద్రంలోని దేవీశ్రీ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్, కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందేందుకు వీలవుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని ఆయన అన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అనిల్ కుమార్ రెడ్డి కోరారుఈ సందర్భంగా 68 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం ₹ 68,07,888 విలువైన కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దశరథ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీకాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, మాజీ ఎంపీపీ నూతి రమేష్, రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య, గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి ,స్థానిక వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ ,పాపిరెడ్డి, ఉప సర్పంచ్ మలుగ మాధవి ,వెంకటేష్,ఏసీఎస్ వైస్ చైర్మన్, జక్క జంగారెడ్డిడై నాయకులు పలుసం సతీష్ గౌడ్ కొండూరు భాస్కర్ గౌడ్ కాసుల వెంకన్న కొండూరు సాయిరెక్టర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,మాజీ ప్రజాప్రతినిధులు,గ్రామ సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

*** మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి:హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని అధికారులను,ప్రజా ప్రతినిధులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.గ్రామాలలో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద బతకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత మట్టి పనులు ఇతర అవసరమైన ఏర్పాట్లు లైటింగ్ ఇతరత్రా కార్యక్రమాలను చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు గ్రామపంచాయతీ కార్యదర్శులు జిపిఓలు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసే వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.

మునిగేపల్లిలో ఘనంగా అలిగిన పూల బతుకమ్మ వేడుకలు

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి:ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామంలో గురువారం అలిగిన పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని దుర్గామాత విగ్రహం వద్ద సర్పంచ్ గంగా ప్రవంతి రవి, ఉప సర్పంచ్ గార్లపాటి శంకర్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తిభావంతో పూజలు.. పల్లెలో పండుగ శోభ బతుకమ్మ పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామస్తులు దుర్గామాతకు పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు కలిసి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

దివ్యాంగులు సమాజంలో

గౌరవ ప్రదంగా జీవించేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి

*** బీఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి: దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ తెల్లకర్ర దినోత్సవం ,భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంసుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారంలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్నవారికి తెల్లకర్ర కేవలం నడకకు ఉపయోగపడే సాధనం మాత్రమే కాదని, అది వారి ఆత్మవిశ్వాసానికి, స్వతంత్రంగా జీవించే హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. వారి ప్రతిభను గుర్తించి, విద్య, ఉపాధి, సామాజిక అవకాశాల్లో సమాన ప్రాధాన్యత కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు.డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ.. కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు.దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ వారికి అవసరమైన సహకారం అందించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు వరాల వినోద్,కోలా శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, గట్టు అశోక్, రాజ్ కుమార్, జన్ముల ప్రభాకర్, రామ్ బాబు, బైరేష్ గౌడ్, సత్యం గౌడ్, చిన్న వెంకటస్వామి, రాజు, అనీల్, గణేష్, మటన్ మహమూద్, బద్రి, జహీర్,లూయిస్ బ్రెయిలీ భవన్ ప్రతినిధులు, నిర్వాహకులు, అంజయ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీర రాఘవన్, యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ , స్థానిక నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల బతుకమ్మకుంట అభివృద్ధి పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మకుంట అభివృద్ధి పనుల కోసం రూ.7 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. బోర్ వెల్ కోసం 5 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా స్థానిక మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ కుంట పనులను చేపట్టారని అన్నారు. తాను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి ప్రతి సంవత్సరం బతుకమ్మ కుంటను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. డివిజన్ ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ బద్రు, ఏఈ ఆశ, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, సోమయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోక యాదగిరి, మహేందర్, ప్రకాష్, ప్రభాకర్, కుమారస్వామి, నవీన్, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం,

ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం, ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై డా. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలాం దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు పరగాని, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కె. అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్, రఫత్, రామచంద్ర నాయక్, సరిత లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లా, నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యం

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో సీఎంసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎంసీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సీఎంసీ నిధుల నుంచి రూ. 17 లక్షలతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ. 13 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ. 3 లక్షలతో ఇంకుడు గుంత / బోరు సంబంధిత పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంసీ నిధులతో కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దంోళ్ల సంజీవ రెడ్డి, వాసవి కాలనీ అధ్యక్షులు మరియు సీనియర్ నాయకులు మేడ శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, సురేందర్ యాదవ్, వీరబాబు, లడ్డు, నవీన్ రెడ్డి, పిల్లి ఆంజనేయులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పి. సాంశివరావు, రమేష్, గూడూరు మురళి, రమేష్ గుప్తా, మహేష్, ఆలేటి శ్రీనివాస్, అమరయ్య, రామరాజు, జగదీష్, వి. నాయేశ్వర్ రావు, భోగేశ్వర్ రావు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల విద్యుత్ కష్టాలకు మోక్షం

*** రూ.6.06 కోట్లతో హైటెన్షన్ వైర్ల షిఫ్టింగ్.ఎమ్మెల్యే డా. మురళీ నాయక్**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి మహబూబాబాద్ పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పట్టణంలో ఇళ్లపై నుంచి వెళ్తున్న ప్రమాదకర 11 కేవీ, 33 కేవీ విద్యుత్ వైర్లను జనావాసాలకు దూరంగా తరలించేందుకు రూ.6.06 కోట్లు మంజూరయ్యాయి.గత ఏడాది సోమ్లా తండా సభలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే డా. మురళీ నాయక్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి పట్టణంలోని హైటెన్షన్ వైర్లతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనికి స్పందించిన ఉప ముఖ్యమంత్రి వెంటనే నిధులు మంజూరు చేశారు.ఈ నిధులతో వైర్ల షిఫ్టింగ్ పనులతో పాటు పట్టణంలో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే చర్యలు చేపట్టనున్నారు.నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, సహకరించిన వరంగల్ ట్రాన్స్ కోసీఎండీ వరుణ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కూసుమంచిలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారంభం



కూసుమంచి ,ప్రజా స్ఫూర్తి:కూసుమంచి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయంను గురువారం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యాలయాన్ని బ్రాంచ్ మేనేజర్ రవి కుమార్, చీఫ్ సెల్స్ మేనేజర్ రామారావు, సెల్స్ మేనేజర్ పెండ్ర అంజయ్య ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ హాఫీజుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ సెట్రామ్ నాయక్, సర్పంచ్ బొంగా నాయక్,నాయకులు భారీ వీరభద్రం,కొండా శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయ సంఘం మండల బాధ్యులు జర్పుల భద్రునాయక్ ,సోషల్ మీడియా అధ్యక్షుడు బెజవాడ శ్రీకాంత్, హాజరై నూతన కార్యాలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, స్థానిక ప్రముఖులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ రవి కుమార్ మాట్లాడుతూ ప్రజలందరికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు ఆడేపు శివ,వడ్డియా బాలకృష్ణ, చెక్కల నాగస్వర్ణ, సురేష్, పోశం రామారావు, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్ సి ఓటరుగా నమోదు చేసుకోవాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎంఎల్ సి ఓటరుగా నమోదు చేసుకోవాలని వెంకటేశ్వర దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతుగంటి వెంకటేశ్వర్లు, డిసిసి కోశాదికారి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక కూరగాయల మార్కెట్ లో ఆర్యవైశ్య నాయకులు పోతుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎంఎల్ సి ఓటరు నమోదు కేంద్రాన్ని వారు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎంఎల్ సి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పోతుగంటి వెంకటేశ్వర్లు, కలకోట లక్ష్మయ్య, తప్సి గాంధి, వెంపటి శభరినాథ్, గుండా శ్రీధర్, చల్లా పాండయ్య,జర్నలిస్టులు కొండా శ్రీనివాస రావు, కొండ్లె కృష్ణయ్య గుప్త, నవిలిపురి నరేందర్, శ్రీరంగం రాము, యామా సంతోష్, తల్లాడ కృష్ణమూర్తి, మంచాల శ్రీనివాస్ గుప్తా, చిత్తలూరి శ్రీధర్ రావు, కొండ్లె చంద్రయ్య, చల్లా శ్రీనివాస్, శిల్ప అజయ్,కూన అర్జున్ గుప్త, బెలిదె ముకుందం, తదితరులు పాల్గొన్నారు

రక్తదాన శిబిరానికి మంచి స్పందన




నర్సాపూర్,ప్రజాస్ఫూర్తి: పద్మభూషణ్ డా. బి.వి. రాజు 106వ జయంతిని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సామాజిక సేవ, మానవతా విలువలను పెంపొందించడంతో పాటు, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.సమాజ సేవకు విశేష కృషి చేసిన డా. బి.వి. రాజు ఆశయాలకు అనుగుణంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం,మానవతా దృక్పథాన్ని పెంపొందించేందుకుకృషి చేసినట్లు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, యువత ఇటువంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, సమాచార సాంకేతిక విభాగాధిపతి దశరథ రామయ్య, వివిధ విభాగాల అధిపతులు, కార్యక్రమ సమన్వయకర్తలు, అధ్యాపకులు, జనరల్ మేనేజర్ బాపి రాజు, ఏజియన్ ఫైనాన్స్‌కు చెందిన కాంతారావు, అధ్యాపక సమన్వయకర్త కృష్ణ ప్రసన్న, విద్యార్థి సమన్వయకర్తలు ఉత్తేజ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బకు వణికిపోయిన హీరోయిన్..

సూపర్ స్టార్ రజినీకాంత్ ఇప్పటికీ బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన జైలర్ 2 చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. కొన్నాళ్లుగా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఇందులో హీరోయిన్ విద్యాబాలన్ సైతం కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ చిత్రంలో తన పాత్ర రజినీకాంత్ కు ధీటుగా నిలబడే రోల్ అని.. దీంతో తాను ఈ పాత్ర చేయడానికి ముందుగా సందేహపడ్డానని అన్నారు. ముఖ్యంగా ఈ చిత్రంలో సిగరేట్ సీన్ చేయడం తాను ఊహించిన దానికంటే ఎక్కువగా సవాలుగా మారిందని అన్నారు. ఈ సినిమా ట్రైలర్ లో చూపించిన సిగరేట్ సన్నివేశాన్ని మొదటి రోజే చిత్రీకరించాల్సి వచ్చిందట. అయితే రజినీకాంత్ సార్‌కు ఎదురుగా నిలబడే పాత్ర తనదని.. అలాంటి బలమైన పాత్ర పోషించడానికి తాను భయపడ్డానని అన్నారు. ముఖ్యంగా సిగరెట్ కాల్చి, ఆ పొగను రజనీకాంత్ సార్ ముఖం మీదకు ఊదమని డైరెక్టర్ తనకు చెప్పినప్పుడు తాను భయంతో వణికిపోయానని అన్నారు. ఈ ఒక్క సీన్ చేయడానికి తాను ఎంతో ఇబ్బంది పడ్డానని...ఏకంగా మూడు టేకులు తీసుకున్నానని అన్నారు. ఈ సీన్ చేయడానికి తాను వణికిపోతున్నప్పుడు మానిటర్ పై అందరూ గమనించారని అన్నారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ సైతం వెల్లడించారు. "మేము ఆ షాట్ తీస్తున్నప్పుడు, నేను మానిటర్ వైపు చూశాను. మేడమ్ సిగరెట్ పట్టుకుని, లిప్‌స్టిక్ రాసుకుంటున్నట్లుగా చేతిని ఊపుతున్నారు. ఆ క్షణంలో, ఇది సరిగ్గా కుదరదని నేను అనుకున్నాను. సుమారుగా మూడో టేక్‌లో మాత్రమే మేము దానిని సరిగ్గా తీయగలిగాము. ఇప్పటికీ, మీరు ఆ సన్నివేశాన్ని చూసినప్పుడు, మేడమ్ కళ్లలో కొద్దిగా ఉద్రిక్తత కనిపిస్తుంది," అని నెల్సన్ అన్నారు. మొదట్లో కాస్త కంగారుపడినప్పటికీ, కొన్ని టేకుల తర్వాత టీమ్ ఆ షాట్‌ను సరిగ్గా చిత్రీకరించగలిగిందని గుర్తు చేసుకున్నారు. ఈ సీన్ ట్రైలర్ లో కూడా కనిపించింది. జైలర్ 2 అక్టోబర్ 15న థియేటర్లలో విడుదల కానుంది.

అమ్మ కదిలి వచ్చే..



సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నాటి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'అమ్మ కదిలి వచ్చే' పాటకు అనుదీప్‌దేవ్ సంగీతాన్నందించారు. కల్యాణ్‌చక్రవర్తి త్రిపురనేని ఈ పాటకు సాహిత్యాన్ని సమకూర్చారు. దుర్గాదేవి ఆరాధనలోని వైభవాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ఇందులో శూలాంభ అమ్మవారి ఉత్సవ ఊరేగింపును చూపించారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి...వంటి అమ్మవారి తొమ్మిది రూపాలను ఈ పాటలో వేడుకగా చూపించడం ప్రధానాకర్షణగా నిలిచింది. నాయకానాయికలు గోపీచంద్, రీతూవర్మ ఈ పాటలో అద్భుతంగా కనిపించారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్‌దేవ్, దర్శకత్వం: సంకల్ప్.



ఇక ఇండియన్ సినిమాపై దృష్టి...

ఇటీవల థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఆవారాపన్ 2 చిత్రంతో మరోసారి వెండితెరపై మెరిశారు దిశా పటాని. ఈ సినిమాలో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. కేవలం ఇండియన్ సినిమాకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటేందుకు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఆమె హాలీవుడ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'హోలీగార్స్ సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో ఆమె రేంజ్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. తన కెరీర్ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు దిశా. తన తొలి బాలీవుడ్ చిత్రం ఎమ్ఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ విడుదలై అప్పుడే పదేళ్లు పూర్తవుతోంది అంటే నమ్మలేకపోతుందట. ఈ దశాబ్ద కాలంలో చిత్ర పరిశ్రమ తనకు ఎన్నో పాఠాలు నేర్పిందని, ఎత్తుపల్లాలతో పాటు ఎంతో అనుభవాన్ని గడించానని. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకూ చాలా వరకు గ్లామర్‌కు ప్రాధాన్యమున్న పాత్రలే చేసుకుంటూ వచ్చాను. ఆ గుర్తింపు నన్ను ప్రేక్షకుల హృదయాల్లో నిలబెట్టింది, అందుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని పేర్కొంది. ఇప్పటి వరకు పోషించిన పాత్రల శైలిని దాటి, కొత్త ప్రయోగాలకు తెరతీయాలని భావిస్తున్నారు దిశా పటాని. ఒకే తరహా మూస పాత్రల్లో బందీ కావడం ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఇకపైన కేవలం తెరపై మెరిసిపోయే పాత్రలకే పరిమితం కానని, వైవిధ్యంతో పాటు కథను మలుపు తిప్పే బలమైన పాత్రలు చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. కథాగమనంలో కీలకంగా ఉంటూ, ప్రేక్షకులను ఎమోషనల్‌గా కట్టిపడేసే క్యారెక్టర్లు ఎంచుకోవడమే నా తర్వాతి లక్ష్యం. ప్రతి సీన్‌లోనూ నాలోని నటిని కొత్త కోణంలో ఆవిష్కరించే పాత్రల కోసం ఎదురుచూస్తున్నాను అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు. ఓ వైపు సూపర్ హిట్లతో జోరు మీదుంటూ, మరోవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న దిశా పటాని.. రాబోయే రోజుల్లో ఎలాంటి విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తారో చూడాలి.



క్రేజీ సినిమా సీక్వెల్‌లో మిల్కీ బ్యూటీ

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత సంచలనం సృష్టించిన బయోగ్రాఫికల్ చిత్రాలలో ది డర్టీ పిక్చర్ సినిమాకు ప్రత్యేక స్థానం ఉంది. అగ్ర నటి విద్యాబాలన్ ప్రధాన పాత్రలో నటించిన ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద నరికొత్త రికార్డులను సృష్టించడంతో పాటు విమర్శకుల ప్రశంసలను కూడా అందుకుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమాకు కొనసాగింపుగా డర్టీ పిక్చర్ 2 చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ సీక్వెల్‌లో మిల్కీ బ్యూటీ తమన్నా నటించే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గ్లామర్ పాత్రలతో పాటు అభినయానికి ప్రాధాన్యత ఉన్న పాత్రలలో రాణిస్తున్న తమన్నాను ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఆమెతో పాటు యానిమల్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి డిమిరి పేరును కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎవరిని ఖరారు చేస్తారనే అంశంపై త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు. మొదటి భాగంలో సిల్క్ స్మిత జీవిత కథ ఆధారంగా సినిమాను తెరకెక్కించగా, ఈ రెండో భాగంలో మాత్రం పూర్తిగా కొత్త కథతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. భిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సీక్వెల్ పై అంచనాలు ఇప్పటికే తారస్థాయికి చేరుకున్నాయి. గత చిత్రానికి మాదిరిగానే ఈ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని చిత్ర యూనిట్ గట్టిగా నమ్ముతోంది. నటీనటుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. సినిమాల పరంగా తమన్నా వరుస ప్రాజె

విజయ్‌రష్మికల గొప్ప మనసు..
ఏకంగా 400 కుటుంబాలకు ఏడాది పాటు..



పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా నటిస్తోన్న మొదటి సినిమా రణబాలి. రాయలసీమతో బ్రిటిష్ పాలకులు సాగించిన ఆకృత్యాల నేపథ్యంలో డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ ఈ మూవీని తెరకెక్కించారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రణబాలి చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్లలో బిజి బిజీగా ఉంటున్నారు రష్మిక విజయ్. ప్రమోషన్స్ ఈవెంట్స్ కోసం దేశమంతా పర్యటిస్తున్నారు. ప్రముఖ ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే రణబాలి టీజర్ ను ముంబయిలో లుడించింది. ఈ మేరకు 'అన్నపూర్ణ' పేరుతో చేపట్టే ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది రష్మిక.

'మీరు పోషించే పాత్రలలో మిమ్మల్ని ప్రభావితం చేసే అంశాలు కొన్ని ఉంటాయి.. మీలో చాలా మంది 'జయమ్మకి, నాకు మధ్య ఏమైనా పోలికలు ఉన్నాయా?' అని అడుగుతూ ఉంటారు. దానికి నా వద్ద సమాధానం ఉంది. ఇది ఎల్లప్పుడూ నేనే. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిఫలంగా నేను ఎప్పుడూ ఇలాంటివి చేస్తూనే ఉంటా.. యగలిగితే..నేను చాలా సంతోషిస్తాను. నేను ఈ రోజు 400 కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఒక్కో కుటుంబానికి 3 నెలల పాటు సహాయం చేయాలనుకుంటున్నా. రాబోయే ఒక సంవత్సరం పాటు దీనిని కొనసాగిస్తా. వారు ఆడబ్బును నిత్యావసరాల కోసం ఆదా చేసి, దానిని తమ భవిష్యత్తును మెరుగ్గా ప్రణాళిక చేసుకోవడానికి ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా. చేసిన సహాయం ఏదీ పెద్దదిగా ఉండాల్సిన అవసరం లేదు. మనమందరం ఏదో ఒక చిన్న విషయంతో ప్రారంభిద్దాం 'నన్ను నమ్మండి, గత కొన్నేళ్లు

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.